పేద విద్యార్థులకు సర్కారు వారి కానుక

- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి ఉచిత విద్య
- వాటిల్లో 25 శాతం సీట్ల కేటాయింపు
- 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక
- అమ్మఒడి కింద పాఠశాలలకు ఫీజు చెల్లింపు

విద్యా వ్యవస్థలో ఇప్పటి వరకు కొన్ని నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితం కాగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిక్కచ్చిగా అమలు చేసి పేద విద్యార్థులు కూడా ప్రైవేట్/ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించేలా చర్యలు చేపట్టింది. బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్/ కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదలకు కేటాయించాలని పేర్కొన్నప్పటికీ నేటి వరకు ఏ ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని అమలు చేయలేదు. అయితే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 18వ తేదీ నుంచి 1వ తరగతిలో ప్రవేశాలు చేపట్టాలని సర్కారు ఆదేశించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది.

ఆదోని అర్బన్ : పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే పేద తల్లిదండ్రుల ఆశ ఫీజులు చెల్లించలేక నీరుగారుతున్న వేళ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి కూడా ఆ విద్య అందుబాటులోకి వచ్చింది. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలంతా చదువుకోవాలని 2009 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం బాలల ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం రూపొందించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు 1వ తరగతిలో పేద పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు వారి ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఎంతో ఉన్నతమైన ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పేద పిల్లలకు 25 శాతం కోటా అడ్మిషన్లు కల్పించాలని ఈనెల 4న జీఓ విడుదల చేసి చర్యలు ముమ్మరం చేసింది. ఆదోని నియోజకవర్గంలో 124 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. కాగా నియోజకవర్గంలో 88 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వం 13, మండల పరిషత్ 42, మున్సిపాలిటీ 31, ఎయిడెడ్ 02 పాఠశాలలు ఉన్నాయి. 2,523 మంది విద్యార్థులు 1వ తరగతి అభ్యసిస్తున్నారు.

కిలో మీటర్ పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యం

విద్యార్థులు నివాసముండే ప్రాంతానికి కి.మీ. పరిధిలో ఉన్న పాఠశాలలకు ప్రథమ ప్రాధాన్యం, అక్కడ లేకపోతే 3 కి.మీ. పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యతనిస్తారు. ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే ఎన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు పొందే వీలు ఉంటుందో స్పష్టమవుతుంది.


ఆదోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

సీట్ల కేటాయింపు, ఫీజుల చెల్లింపు ఇలా..

ప్రతి ప్రైవేట్ పాఠశాలలో అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లను యాజమాన్యాలు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు 6–14 సంవత్సరాల వయస్సులోపు పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలలో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని అడ్మిషన్‌కు రూ.6,500 గా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో అమ్మఒడి పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు అందజేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బుతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును విద్యార్థి తల్లి/ సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించింది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్..

ఈనెల 16వ తేదీ వరకు ప్రైవేట్ పాఠశాలల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఏప్రిల్ 9 నుంచి 12 వరకు సచివాలయాల్లో ఉన్న డేటా ద్వారా అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు. ఏప్రిల్ 13వ తేదీన లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అదే నెల 15 నుంచి 21వ తేదీ వరకు ఆయా స్కూళ్లకు విద్యార్థుల అడ్మిషన్‌లను ఖరారు చేస్తారు. మిగులు సీట్లకు ఏప్రిల్ 25న రెండోసారి లాటరీ నిర్వహిస్తారు. 26 నుంచి 30వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేస్తారు.

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపు ప్రతి పాఠశాల పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించాం. పేద విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. వారి చదువు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. 2023–24 విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయిలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది. – శివరాములు, ఎంఈఓ

క్లుప్తంగా

పేదలకు వరం 'వైఎస్సార్ బీమా'


బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: పేదలకు వైఎస్సార్ బీమా పథకం వరమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాసం వద్ద 19వ వార్డులో వివిధ కారణాలతో మరణించిన బాధితుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. మల్లికార్జున నామినీ అయిన భార్య లక్ష్మీదేవికి, హనుమంతు భార్య నాగవేణికి రూ.లక్ష చొప్పున వైఎస్సార్ బీమా పథకం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మధుబాబు, నాయకులు మొండిమల్లయ్య, వెల్ఫేర్ సెక్రటరీ చంద్రశేఖర్, నాయకులు వెంకటేశులు, అంజి, మణిబాబు, హనుమంతు, నాగరాజ్, నరసయ్య, వీరేష్ పాల్గొన్నారు.

శ్రీమఠానికి విరాళాలు

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి మఠానికి విరాళాలు వెల్లువెత్తాయి. గురువారం కర్ణాటకలోని చిక్ మంగుళూరుకు చెందిన ఉదయ్‌కుమార్ కేజీ వెండి, చిత్రదుర్గ వాసి శివకృష్ణ తన తల్లి జ్ఞాపకార్థం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. వెండి రథం నిర్మాణార్థం విరాళాలు అందజేసినట్లు మఠం మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

మంత్రాలయం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు మజ్జిగ గోవిందమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ప్రభావతి నేతృత్వంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి ప్రతిపాదనలు, అభివృద్ధి పనుల గురించి చర్చించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యులకు ఓటరు స్లిప్పులను ఎంపీడీఓ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులికుక్కర రాఘవేంద్ర, సీడీపీఓ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, పీఆర్ ఏఈ నరసింహులు, ఏపీఓ తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు అంజిని,మేకల సుజాత ఎంపీటీసీ సభ్యులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోని రూరల్ : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు.కౌతాళం మండలంలోని తోవి క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టగా తోవి గ్రామానికి చెందిన ఉశేని, పరశురాం అనే ఇద్దరు రెండు మోటార్ సైకిళ్లపై చెరొక 9 బాక్సులు ఓసీ డీలక్స్ కర్ణాటక విస్కీ ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో పోలీస్ కానిస్టేబుళ్లు సోమేష్, శ్రీనివాస్, రోహిస్ ఉన్నారు.

ఖాదర్‌లింగ స్వామికి ఫాతెహాలు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి స్వామికి చాదర్ సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన రతీమన్మథుల వేడుకలు


మహిళల వేషధారణలో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న పురుషులు

ఆదోని రూరల్ : మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో గురువారం రతీమన్మథుల వేడుకలు ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి రతీమన్మథుల ఆలయానికి పురుషులు ఆడవారి వేషంలో కుంభాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ 300 సంవత్సరాల నుంచి ఆచారం వస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

ఆదోని అర్బన్ : ఖాళీగా పోస్టులను భర్తీ చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాజశేఖర్‌రావు, రఘురామయ్య, తాయప్ప ,రమేష్ పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

కౌతాళం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని ఉరుకుంద, ఓబుళాపురం గ్రామాల్లో గురువారం ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడు ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు వేయాలని కోరారు.

కోసిగి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సిద్దప్ప పాళెం, దొరల చావిడి, ఊరువాకిలి, దుర్గమ్మ దేవి కాలనీలలో పట్టభద్రుల ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి ఓటు అభ్యర్థించారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, మహాంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని సర్పంచ్ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు గజేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో అభ్యర్థులను కలసి ఓటు అభ్యర్థించారు.

ఆదోని రూరల్ : ఈనెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి పట్టభద్రులైన కళాకారులను ఓటు వేసి గెలిపించాలని పార్టీ కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్ రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆదోనిటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతునివ్వాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, పట్టణ కన్వీనర్ ఫయాజ్ అహ్మద్ కోరారు. గురువారం పట్టణంలోని 7, 8, 21 వార్డుల్లో వెన్నపూసను గెలిపించాలని కోరుతూ పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అలాగే పాండవగల్ గ్రామంలో గిడ్డయ్య, ఆంజనేయులు, చిన్నోడు, తిక్కయ్య ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దేవా, కౌన్సిలర్‌లు రాజేశ్వర్‌రెడ్డి, ఉస్మాన్, పట్టణ కన్వీనర్‌లు మధుసూదన్‌శర్మ, ఫయాజ్‌అహ్మద్ ప్రచారం చేశారు.

భక్తుల కోసం షెడ్డు నిర్మాణం


నిర్మించిన షెడ్డులో ఆలయ ఈఓ, అర్చకులు, దాతలు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం బెల్డోన గ్రామానికి చెందిన కోనంకి గోవిందమ్మ, కోనంకి అశోక్‌ల జ్ఞాపకార్థం వారి మనవరాలు కావ్య చౌదరి రూ.11.50 లక్షలతో షెడ్డు నిర్మించారు. గురువారం పూజలు నిర్వహించి షెడ్డు ను ప్రారంభించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు రంగస్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదాన్ని అందజేశారు.

పగుళ్లిచ్చిన గృహాల పరిశీలన


రాతనలో వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

తుగ్గలి: ఈనెల 7వ తేదీన రాతన గ్రామంలో పగుళ్లు ఇచ్చిన పలువురి ఇళ్లను గురువారం జిల్లా అధికారుల బృందం పరిశీలించింది. భూకంపం అంటూ ప్రచారం జరగడంతో అధికారుల బృందం పర్యటించింది. పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ వెంకటనారాయణతో పాటు జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేటు కంపెనీ లిమిటెడ్ జియలాజిస్టు వేదానందరెడ్డి గ్రామంలో పగుళ్లు ఇచ్చిన ఇళ్లను సందర్శించి ఇంటి యజమానులతో మాట్లాడారు. పగుళ్లకు కారణాలపై ఆరా తీశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు విజయకుమార్, హనుమంతు, పంచాయతీ కార్యదర్శి శివ ఉన్నారు.

శనగల కొనుగోళ్లు ప్రారంభం


ఆస్పరిలో శనగల కొనుగోళ్లను ప్రారంభించిన ఏఓ మునెమ్మ

ఆస్పరి: ఆస్పరిలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోళ్లను ప్రారంభించారు. ఏఓ మునెమ్మ మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి వంద క్వింటాళ్ల దాకా కొనుగోళ్లు చేస్తామన్నారు. క్వింటా ధర రూ.5,335 ప్రకారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మండలంలోని ఆస్పరిలో 302 మంది రైతులు, జొహరాపురంలో 295 మంది, చిన్నహోతూరులో 38 మంది, చిగిలిలో 73 మంది, నగరూరులో ఐదుగురు మొత్తం 713 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. ఆస్పరి తరువాత మిగతా చిన్నహోతూరు, జొహరాపురం గ్రామాలలో కూడా కొనుగోళ్లను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పుల్లగుమ్మిలో పోలీసుల పల్లెనిద్ర


మాట్లాడుతున్న ఎస్‌బీ కర్నూలు డీఎస్పీ వెంకటాద్రి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన పుల్లగుమ్మిలలో గురువారం పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో స్పెషల్ బ్రాంచ్ కర్నూలు డీఎస్పీ వెంకటాద్రి హాజరై మాట్లాడారు. ప్రజలు శాంతి యుతంగా జీవించాలని, అందుకు ఫ్యాక్షన్‌కు, గొడవలకు స్వస్తి పలకాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. నేరాల వలన కలిగే నష్టాలు వివరించారు. చిన్నచిన్న గొడవలను క్షణికావేశంలో పెద్దవిగా చేసుకోవద్దన్నారు.

శ్రీరంగనాథుడికి లక్ష్మీకాసుల దండ విరాళం


ఈఓకు దండను అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామికి ఉల్లిందకొండకు చెందిన భక్తులు రాజారెడ్డి రూ.1.60 లక్ష లు విలువ చేసే 30 గ్రాముల లక్ష్మీకాసుల దండ ను విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురు వారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి హారాన్ని అందజేశారు. ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్స వాల సందర్భంగా అమ్మ వారికి ఈ దండను అలంకరించి పూజలు చేయడం జరుగుతుందన్నారు. దాతలకు స్వామి వారి ప్రసాదం అందజేశారు.

ప్రజల సంక్షేమం కోసమే సచివాలయాలు


సర్వే వివరాలను పరిశీలిస్తున్న బాలకృష్ణారెడ్డి

కౌతాళం: ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని అభివృద్ధి ఫలాలు వారికి అందజేయాల్సి బాధ్యత మనందరిదని జిల్లా నోడల్ అధికారి మరియు డీవిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏరిగేరి, సుళేకేరి, వల్లూరు, గుడికంబాలి సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏరిగేరి సచివాలయంలో వలీంటర్లు బుజ్జమ్మ, రామాంజనేయులు పద్దతి మార్చుకోవాలని లేకపోతే ఉద్యోగాన్ని వదులుకోవాలని హెచ్చరించారు. ఎస్‌డీజీ సర్వే (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు)కు సంబంధించి 0–5వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్ కార్డు లేకపోతే వారి జాబితా తయారు చేసి ఆధార్ నమోదు చేయించాలని, ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక పీహెచ్‌సీల్లో తీసుకొని సర్వే పూర్తి చేయాలని సూచించారు. 6–19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉంటే వారి ఫోన్ ద్వారా ఓటీపీ వివరాలతో ఆన్‌లైన్ నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేసి వారికి కార్డు ఇవ్వాలని దీని వల్ల వారికి రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి


ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లకు సూచనలిస్తున్న ఎంఈఓ శివరాములు

ఆదోని అర్బన్ : ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని ప్రతి ప్రైవేట్ పాఠశాల అమలు చేయాలని ఎంఈఓ శివరాములు తెలిపారు. గురువారం స్థానిక నేషనల్ పాఠశాలలో మండల ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో విద్యాహక్కు చట్టంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు పోర్టల్‌లో ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించి, అడ్మిషన్లు చేపట్టాలని ఆదేశించారు. అలాగే తమ పరిధిలోని వార్డు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సీఆర్‌పీలు గౌస్, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు


తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్


ఆదోని రూరల్ : ఈనెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పటిష్టమైన భద్రత, బారికేడ్లు, విద్యుత్, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదోని డివిజన్ వారీగా పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు–19, ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు –9, స్థానిక ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం –1, డివిజన్ వారీగా పట్టభద్రుల ఓటర్లు 17,341, 1,261 మంది ఉపాధ్యాయ ఓటర్లు, 259 స్థానిక సంస్థల ఓటర్లు ఉన్నారని వివరించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నాగలదిన్నెలో లోకాయుక్త విచారణ


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న లోకాయుక్త సభ్యుడు రిటైర్డు డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని శ్మశాన వాటిక స్థలంపై లోకాయుక్త సభ్యుడు రిటైర్డు డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలోని సర్వేనంబర్ 94లో భూ ఆక్రమణ జరిగిందంటూ ఫిర్యాదులు రావడంతో ఆయన స్థలాన్ని సందర్శించి విచారణ చేశారు. గురువారం సదరు స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విచారణలో తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈవోపీఆర్‌డీ ఈశ్వరయ్య, ఎస్ఐ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎస్ఐకి పదోన్నతి


ఎస్ఐ కృష్ణమూర్తి

మద్దికెర: మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తికి ఎస్ఐగా పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు.

గజేంద్ర వాహనంపై శ్రీరంగనాథుడు


గజేంద్రునిపై కొలువు తీరిన శ్రీవారు

మద్దికెర : పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడు వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా గురువారం గజవాహన సేవ నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాత్రి శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజేంద్రుడి వీపుపై కొలువు చేసి గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం కల్యాణోత్సవం,రథోత్సవం నిర్వహించనున్నారు.

గరుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు: అరికెరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ, తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు https:// appcet. apfss. in, ఇంటర్మీడియెట్‌కు https:// apgpcet. apcfss. in/ inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేరాల నియంత్రణపై అవగాహన

మంత్రాలయం రూరల్: మండలంలోని దిబ్బనదొడ్డి గ్రామంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణపై గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. వి.తిమ్మాపురం గ్రామంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మహిళలకు దిశ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎవ్వరైనా అలర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనుల తనిఖీ

ఆదోని టౌన్ : పట్టణంలో ప్రతివార్డులో రోడ్లు, కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం 6వ వార్డులో కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులతో కలిసి తనిఖీ చేశారు. మండిగిరి వీధిలోనూ జరుగుతున్న కొత్త మురుగు కాలువల పనులను పరిశీలించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కోసిగి: మండలంలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నారాయణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు మెమెంటో అందజేశారు.ఉపాధ్యాయినులు శ్యామలకుమారి, శశిరేఖ భాయి, సౌజన్య, మైథిలీ, ఉపాధ్యాయుడు భీమేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి


మృతి చెందిన రామాంజనేయులు (ఫైల్)

ఆదోని అర్బన్ : కోసిగి మండలం సజ్జల గుడ్డంకు చెందిన రామాంజనేయులు (48) ఆర్టీసీ డ్రైవర్ గురువారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుకు గురై మృతి చెందారు. స్థానిక ఆర్టీసీ డ్రైవర్‌లు తెలిపిన వివరాల మేరకు.. ప్రతిరోజూ గ్రామం నుంచి ఆదోనికి వచ్చి వెళ్లేవాడని, గురువారం విధుల్లో భాగంగా ఆదోని నుంచి కౌతాళంకు వెళ్తుండగా గుండెలో నొప్పి రావడంతో బస్సును అక్కడే నిలిపేసి కారులో ఆదోని ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స పొంది ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

వెల్దుర్తి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లకు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రాజేశ్వరి గురువారం తెలిపారు. ఓటరు లిస్ట్‌లో పేరు ఉండి, ఓటరు స్లిప్పు లేనివారికి పోలింగ్ బూత్ వద్ద హెల్ప్‌డెస్క్ ద్వారా ఓటరు స్లిప్పు అందజేస్తామన్నారు. ఓటరు స్లిప్పుతోపాటు ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదేని ఐడీ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.